# బలగం TV BALAGAM

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 05 ఆగస్టు 2025 | www.balagamtv.com | పేజీలు 4


## నేటి నుంచి ఎప్‌సెట్ తుదివిడత కౌన్సెలింగ్

- 6,7 తేదీల్లో వెబ్ఆప్షన్ల నమోదు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం ప్రాసెసింగ్ ఫీజు చెల్లించడానికి అవకాశముందనీ, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల ఆరో తేదీన ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు.

ఈనెల ఆరు, ఏడు తేదీల్లో వెబ్ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని వివరించారు. ఈనెల పదో తేదీన ఎప్‌సెట్ తుదివిడత ప్రవేశాలకు సంబంధించిన సీట్లను కేటాయిస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.



# మునిగిన నగరం

- హైదరాబాద్‌లో భారీ వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- జలమయమైన కాలనీలు, ప్రధాన రహదారులు
- ట్రాఫిక్ జామ్‌తో వాహనదారుల ఇక్కట్లు
- మరో రెండ్రోజుల పాటు ఒక మోస్తారు వర్షాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గ్రేటర్ హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన గాలులతో వర్షం పడటంతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. నాలాలు పొంగి రోడ్లపై డ్రయినేజీ వాటర్ ప్రవహిస్తుండడంతో రహదారులు చెరువులను తలపించాయి. ఒక్కసారిగా కురిసిన వర్షంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం మధ్యాహ్నం సుమారు రెండు గంటలపాటు కుండపోత వర్షం కురిసింది. కొద్ది రోజులుగా నగరంలో పొడి వాతావరణం నెలకొన్నా, సోమవారం కురిసిన భారీ వర్షంతో నగరంలోనిపలు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని చాలా ప్రాంతాల్లో రోడ్లపై ట్రాఫిక్ కిలోమీటర్ల మేర నిలిచిపోయింది. ముఖ్యంగా పంజాగుట్ట, అమీర్‌పేట్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కారణంగా వాహనదారులు ఇబ్బంది పడ్డారు. కేవలం గడిచిన రెండున్నర గంటల్లో 15 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కుత్బుల్లాపూర్‌లో 15 సెంటిమీటర్లు, బంజారాహిల్స్ ప్రాంతంలో 11.23 సెంటీమీటర్ల వర్షంపాతం నమోదైంది. గచ్చిబౌలి పరిధి ఖాజాగూడలోని లాంకో హిల్స్ సర్కిల్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా ఓ తాటిచెట్టుపై పిడుగు పడింది. రోడ్డు పక్కన ఉన్న తాటిచెట్టుపై ఒక్కసారిగా భారీ శబ్దంతో పిడుగు పడడంతో జనం భయపడి పరుగులు తీశారు. దానికితోడు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు.

ముఖ్యంగా నగరంలోని లక్డీకాపూల్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సికింద్రాబాద్, బషీర్‌బాగ్, నాంపల్లి, ఆర్టీసి క్రాస్ రోడ్డు, బేగంపేట, మెహిదీపట్నం, టోలీ చౌకీ, దిల్‌సుఖ్‌నగర్, మలక్ పేట, పాతబస్తీ, చార్మినార్, రాజేంద్రనగర్, మాదాపూర్ తదితర దాదాపు అన్ని ప్రాంతాల్లో సుమారు రెండున్నర గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. బంజారాహిల్స్‌లో భారీ వృక్షం నెలకొరగటంతో ట్రాఫిక్ సమస్య మిగితా 2వ పేజీలో

# అసెంబ్లీలో
# కాళేశ్వరం నివేదికపై చర్చ



- ఆమోదం తెలిపిన క్యాబినెట్
- అసెంబ్లీలో చర్చల తర్వాత భవిష్యత్ కార్యాచరణ
- రాజకీయ కక్షపూరిత చర్యలుండవు
- అందరి అభిప్రాయాలు తీసుకుంటాం
- అన్ని పార్టీలు మాట్లాడటానికి అవకాశం ఇస్తాం
- పీసీ ఘోష్‌ది స్వతంత్ర న్యాయ కమిషన్
- సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో న్యాయ విచారణ జరిపిన జస్టిస్ చంద్ర ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టి అందరి అభిప్రాయాల మేరకు తదుపరి కార్యాచరణ ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. జస్టిస్ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను రాష్ట్ర మంత్రిమండలి యధాతథంగా ఆమోదించినట్టు తెలిపారు.జస్టిస్ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికపై ముఖ్యమంత్రి గారి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రిమండలి సమావేశం సమగ్రంగా చర్చించింది. కమిషన్ రిపోర్ట్‌ను విశ్లేషించడానికి నియమించిన ఉన్నతస్థాయి కమిటీ అందజేసిన సంక్షిప్త నివేదికపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంత్రివర్గ సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మొత్తం మంత్రివర్గ సహచరులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను మంత్రిమండలి ఆమోదించడమే కాకుండా రాబోయే రోజుల్లో దాన్ని శాసనసభ, శాసనమండలి ముందు పెట్టి స్వేచ్ఛగా అన్ని పక్షాల అభిప్రాయాలను తీసుకున్న తర్వాత తదుపరి నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు.

"జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో చెప్పిన అన్ని అంశాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాకు సమగ్రంగా వివరించడం జరిగింది. జస్టిస్ ఘోష్ కమిషన్ మార్చి నెల 31 వ తేదీన 665 పేజీలతో కూడిన సుదీర్ఘమైన నివేదికను ప్రభుత్వానికి అందించింది. దానిపై ప్రభుత్వం నియమించిన ముగ్గురు అధికారులతో కూడిన కమిటీ సమగ్రంగా విశ్లేషించి సంక్షిప్తంగా ఒక నివేదిక అందించింది. మొత్తం నివేదికతో పాటు అధికారుల కమిటీ సంక్షిప్త నివేదికను మంత్రిమండలి ఆమోదించింది.

మేం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం ఆ ప్రాజెక్టుపై న్యాయ విచారణ కోసం అనుభవం కలిగిన న్యాయకోవిదుడు, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో స్వతంత్ర కమిషన్ నియమించాం. మాజీ సీఎం కే చంద్రశేఖర్ రావు గారు, ఆనాటి నీటి పారుదల మంత్రి హరీష్ రావు గారు, ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ గారితో పాటు ఐఏఎస్ అధికారులు, నిర్మాణ సంస్థలు, నిపుణులు, ఎంతో మంది నుంచి సమగ్రమైన సమాచారం సేకరించిన మీదట నివేదిక ప్రభుత్వానికి అందజేశారు.

2007–08 లో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి గారి హయాంలో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టగా, రాష్ట్ర విభజన అనంతరం అధికారంలోకి వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఆ ప్రాజెక్టు పేరు, స్థలం మార్చి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం చేపట్టారు. 2015–16 లో మొదలు పెట్టిన ప్రాజెక్టు 2018 లో పూర్తయినట్టు ప్రకటించారు. నిర్మించిన మూడేళ్లలోపు 2023 లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మేడిగడ్డ కూలిపోగా, అన్నారం, సుందిళ్ల పగుళ్లు రావడం, దానిపై ఆనాటి ప్రభుత్వ హయాంలోనే సాంకేతిక నిపుణులు, ఎన్డీఎస్ఏ ప్రతినిధి బృందం పూర్తి స్థాయి విచారణ చేపట్టి నివేదిక అందజేసింది.ప్రాజెక్టు ఊరు, పేరు, అంచనాలు మార్చి అవినీతికి పాల్పడి అక్రమాల పునాదులపై వేసిన మిగితా 2వ పేజీలో

### పరిశ్రమల ఏర్పాటుకు
### అనువైన వాతావరణం కల్పిస్తాం

- హైదరాబాద్‌ను గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల హబ్‌గా మార్చాం
- సీఎం రేవంత్ రెడ్డి
- ఎలీ లిల్లీ జీసీసీ కేంద్రాన్ని మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించిన సీఎం

వివరాలు 2వ పేజీలో

# భారత్‌పై ఇంకా సుంకాల పెంపు



- ట్రంప్ హెచ్చరిక


**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఉక్రెయిన్‌పై యుద్ధం కొనసాగిస్తున్న రష్యా నుంచి భారీ మొత్తంలో చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా భవిష్యత్తులో కఠిన చర్యలు తీసుకోనుందని, అందులో భాగంగా అమెరికాకు చెల్లించే సుంకాలను పెంచతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్లో పేర్కొంటూ, భారత్ రష్యా చమురును భారీ లాభాలపై బహిరంగ మార్కెట్లలో అమ్ముతోందని ఆరోపించారు. "రష్యా యుద్ధంలో వేల మంది ఉక్రెయిన్ పౌరులు బలవుతున్నారు. అయినా భారత ప్రభుత్వం దీనిపై స్పందించకపోవడం బాధాకరం. అమెరికా ఇప్పుడు భారత్‌పై ఆర్థికంగా ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉంది," అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

ఇప్పటికే భారతీయ రిఫైనరీలు రష్యా నుంచి ముడి చమురును నిలిపివేశాయని వచ్చిన కథనాలను ట్రంప్ ప్రశంసించిన రెండు రోజులకే, ఆయన తాజాగా మరోసారి హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం. "భారత్ అమెరికా వస్తువులపై భారీ సుంకాలు విధిస్తోంది. అంతేకాకుండా ఇమిగ్రేషన్ వ్యవస్థను కూడా మోసం చేస్తోంది" అని వైట్ హౌస్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ స్టీఫెన్ మిల్లర్ ఆరోపించారు.

రష్యా చమురు కొనుగోలులో భారత్‌తో పాటు చైనా భాగస్వామ్యం ఉందన్న వాస్తవాన్ని ప్రపంచం గమనిస్తే పెద్ద వివాదం తప్పదని మిల్లర్ వ్యాఖ్యానించారు. "ట్రంప్ మొదటి నుంచి భారత్‌తో బలమైన సంబంధాలను కోరుకున్నా, ఈ విషయంలో మాత్రం ఆయన గంభీరంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు," అని పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలపై భారత ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. చమురు దిగుమతులు పూర్తిగా మార్కెట్ శక్తులు, జాతీయ ప్రయోజనాల ఆధారంగా జరుగుతున్నాయని వెల్లడించాయి. "రష్యా చమురు దిగుమతులు నిలిపివేశామని వచ్చిన వార్తలకు ఎలాంటి ఆధారం లేదు. భారత్‌కు అవసరమైన ఇంధనాన్ని, ఎక్కడి నుంచి సరైన ధరకు లభిస్తే అక్కడినుంచి దిగుమతి చేసుకుంటుంది" అని పేర్కొన్నారు.

# కొంతమందిని అరెస్ట్ చేయొచ్చు..



- అది కాళేశ్వరం కమిషన్ కాదు కాంగ్రెస్ కమిషన్
- పెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు
- మాజీ సీఎం కేసీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సిద్ధిపేట జిల్లాలోని ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు కీలక సమావేశం నిర్వహించారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై కమిషన్ నివేదిక బయటకు వచ్చిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆరు గంటలుగా కొనసాగుతున్న ఈ భేటీలో హరీష్ రావు, కేటీఆర్, జగదీష్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి వంటి పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. కాళేశ్వరం అంశంపై పార్టీ తరఫున తీసుకోవాల్సిన భవిష్యత్ చర్యలపై చర్చించారు.సమావేశంలో కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు.

"ఇది కాళేశ్వరం కమిషన్ కాదు, కాంగ్రెస్ కమిషన్" అని వ్యాఖ్యానించారు. కమిషన్ నివేదిక ఊహించినట్లుగానే వచ్చిందని, దానిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.

"కొంతమంది బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేసే అవకాశం ఉంది. అయితే భయపడవద్దు. ఇది రాజకీయ పన్నాగం తప్ప మరేం కాదు," అని కేసీఆర్ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును పనికిరాదని చెప్పేవారు అజ్ఞానులని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని పార్టీగా బలంగా తిప్పికొట్టాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ప్రాజెక్ట్ ద్వారా తెలంగాణకు కలిగిన ప్రయోజనాలను ప్రజలకు విపులంగా వివరించాలని సూచించారు. కేబినెట్ సమావేశంలో కాళేశ్వరం పై ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని చూసి తగిన వ్యూహం సిద్ధం చేస్తామని కేసీఆర్ ప్రకటించారు.

# అప్రమత్తంగా ఉండండి

- భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్లకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలనీ, లోతట్టు ప్రాంతాల్లో తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విపత్తు సహాయక బృందాలు అందుబాటులో ఉండి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలన్నారు. జీహెచ్ఎంసీతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వరద నీటి ఉధృతి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సీఎం సూచించారు. రానున్న రెండు మూడు రోజులు వర్షాలు ఉంటాయనే సమాచారం ఉన్నందున కలెక్టర్లు జిల్లాల్లోని అన్ని విభాగాలతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలు, వరదలతో ఎటువంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు, ఎలాంటి సహాయమైనా అందించేందుకు అధికారులు జిల్లాల్లోనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో మాట్లాడి ఎప్పటికప్పుడు తగిన సూచనలు చేయాలని సూచించారు.

# శిబూ సోరెన్ ఇకలేరు

- కిడ్నీ సంబంధిత సమస్యలతో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- రాష్ట్రపతి, ప్రధాని, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ సహా పలువురు ప్రముఖుల సంతాపం
- జార్ఖండ్ ఏర్పాటులో కీలక పాత్ర
- గిరిజన హక్కుల కోసం పోరాటం
- ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా విశేష సేవలు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఝార్ఖండ్ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పోరాడిన మాజీ ముఖ్యమంత్రి శిబూ సోరెన్ (81) ఇకలేరు. ఢిల్లీలోని గంగారాం ఆస్పత్రిలో శనివారం రాత్రి ఆయన తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా మూత్రపిండాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతున్న గంగారాం ఆసుపత్రిలో మృతి చెందారు.

**మూడు సార్లు సీఎం, ఎనిమిది సార్లు లోక్‌సభ సభ్యుడు**

1970లలో ఝార్ఖండ్ ముక్తి మోర్చా స్థాపించి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి అండగా నిలిచిన శిబూ సోరెన్, రాష్ట్రం ఏర్పడిన అనంతరం మూడు సార్లు ముఖ్యమంత్రిగా, 2004–2006 మధ్య కేంద్ర మంత్రిగా పనిచేశారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎనిమిది సార్లు లోక్‌సభకు, రెండు సార్లు రాజ్యసభకు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఆయన కుమారుడు.

తండ్రి మృతిని స్వయంగా సీఎం హేమంత్ సోరెన్ ప్రకటించారు. ఎక్స్ (ట్విట్టర్) వేదికగా, "ఈ రోజు అన్నీ కోల్పోయాను..." అంటూ తన బాధను వ్యక్తం చేశారు.

**ప్రధానమంత్రి, రక్షణమంత్రి సంతాపం**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, శిబూ సోరెన్ మృతి పట్ల సంతాపం ప్రకటించారు. "అట్టడుగు వర్గాల కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత వ్యక్తి. పేదలు, గిరిజనుల సాధికారత కోసం పని చేసిన నిస్వార్థ నేత. ఆయన మృతి బాధాకరం" అంటూ

ట్వీట్ చేశారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైతం "శిబూ సోరెన్ మరణ వార్త అత్యంత విషాదకరం" అంటూ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 1944 జనవరి 11న బీహార్ రాష్ట్రంలోని హజారిబాగ్ జిల్లా నేమ్రా గ్రామంలో, సంతాల్ గిరిజన తెగకు మిగితా 2వ పేజీలో

# రిజర్వేషన్ లక్ష్యంగా చేపట్టిన దీక్ష విరమణ



- బీసీలకు 42% రిజర్వేషన్ లక్ష్యంగా చేపట్టిన దీక్ష విరమణ
- కోర్టు అనుమతి లేకపోవడంతో ఎమ్మెల్సీ కవిత నిర్ణయం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం చేపట్టిన 72 గంటల నిరాహార దీక్షను విరమిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం ప్రకటించారు. హైకోర్టు తమ దీక్షకు అనుమతి నిరాకరించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వెల్లడించారు. కోర్టుల పట్ల గౌరవం ఉంచే తనకు, ధిక్కరించే పరిస్థితి లేదని పేర్కొన్నారు.

బీసీల హక్కుల కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన తప్పులపై పోరాటం చేస్తున్నామని కవిత స్పష్టం చేశారు. "ఈ దీక్షను కోర్టు తీర్పును గౌరవించి విరమిస్తున్నా. కానీ ఈ ఉద్యమం ఆగదు. మరో రూపంలో, మరో పోరాటం కొనసాగుతుంది," అని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండానే ఎన్నికలకు వెళితే ఎలా ఆపాలో తాను బాగా మిగితా 2వ పేజీలో



# నిజమైన భారతీయులు
## అలా మాట్లాడరు

- రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు ఆగ్రహం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

చైనా భారత భూభాగాన్ని ఆక్రమించిందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. భారత్ భూభాగంపై 2 వేల కిలోమీటర్లు ఆక్రమణలో ఉన్నాయని చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పిటిషన్‌పై విచారిస్తున్న ధర్మాసనం.. "నిజమైన భారతీయులెవరూ అలా మాట్లాడరు" అని వ్యాఖ్యానించింది. 2022లో భారత్ జోడో యాత్ర సందర్భంగా చేసిన ఈ వ్యాఖ్యలను తప్పుబడుతూ, రాహుల్‌కు కోర్టు తీవ్రమైన ప్రశ్నలు సంధించింది. "చైనా ఆక్రమణను మీరు ఎలా నిర్ధారించగలిగారు?" అని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది.

ఈ సందర్భంలో రాహుల్ తరఫున వాదన వినిపించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ మాట్లాడుతూ మిగితా 2వ పేజీలో

### పరిశ్రమల ఏర్పాటుకు

# అనువైన వాతావరణం కల్పిస్తాం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల కాలంలోనే హైదరాబాద్‌ను గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల కు హబ్‌గా మార్చామని తెలిపారు.

ప్రపంచ ప్రఖ్యాత ఫార్మా దిగ్గజం ఎలీ లిల్లీ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్‌ను మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారితో కలిసి ముఖ్యమంత్రి గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ చరిత్రలో ఈ ఘట్టం ఒక మైలురాయిగా నిలిచిపోతుందని వ్యాఖ్యానించారు.పారిశ్రామిక అభివృద్ధి సహా అన్ని రంగాల్లో తెలంగాణను ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలపడమే తమ లక్ష్యమని, ఆ దిశగా చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నాలకు హైదరాబాద్ జీసీసీ హబ్‌గా ఎదగడం ఒక నిదర్శనమని చెప్పారు. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారిని, సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి గారు ప్రత్యేకంగా అభినందించారు.

“తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. ఎలీ లిల్లీ వంటి ప్రపంచ స్థాయి సంస్థ హైదరాబాద్‌కు రావడం గర్వకారణం. ఇప్పటికే హైదరాబాద్‌లో 2 వేలకు పైగా లైఫ్ సైన్సెస్ కంపెనీలు, 200 అంతర్జాతీయ సంస్థలు ఉన్నాయి. దేశంలో తయారవుతున్న టీకాలలో ప్రతి మూడో టీకా ఇక్కడే ఉత్పత్తి అవుతోంది. జీనోమ్ వ్యాలీ దేశంలోనే అతిపెద్ద లైఫ్ సైన్సెస్ పరిశోధనాభివృద్ధి కేంద్రంగా ఉంది. ఈ విజయం హైదరాబాద్‌లోని ప్రతిభ, పాలసీ దృఢత, మరియు బలమైన మౌలిక సదుపాయాలకు నిదర్శనం.

మధుమేహం, క్యాన్సర్, ఇమ్యునాలజీ, న్యూరోసైన్స్ వంటి రంగాల్లో ఎలీ లిల్లీ చేసే కృషి ఒక ‘గేమ్ ఛేంజర్’ అవుతుంది. పరిశ్రమలకు అనువైన వాతావరణాన్ని కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుంది. హైదరాబాద్‌లో పని చేయబోయే ఎలీ లిల్లీ ఉద్యోగులు ఇకపై తెలంగాణ కుటుంబ సభ్యుల్లాంటి వారే. వారి సహకారంతో తెలంగాణను భారతదేశ లైఫ్ సైన్సెస్ రాజధానిగా మాత్రమే కాకుండా, ప్రపంచంలో ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలకు నంబర్ వన్ హబ్‌గా అభివృద్ధి చేస్తాం” అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు ఎలీ లిల్లీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డియాగో రావ్ గారు, ఇండియా ప్రెసిడెంట్ విన్సెలోవ్ టకర్ గారు, మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ అరోరా గారు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# శిబూ సోరెన్ ఇకలేరు

(మొదటి పేజీ తరువాయి)

చెందిన కుటుంబంలో జన్మించిన శిబూ సోరెన్ చిన్ననాటి నుంచే గిరిజన హక్కులపై ఆసక్తి కలిగి ఉండేవారు. 1960లలో ‘సంతాల్ సుధవ్ సమాజ్’ స్థాపించి, ధన్‌బాద్ జిల్లాలో ఆశ్రమం ప్రారంభించి, గిరిజనుల సంక్షేమానికి పాటుపడ్డారు. ‘దిషోమ్ గురు’ (లీడర్ ఆఫ్ ద ల్యాండ్)గా గిరిజనులు ఆయన్ను గౌరవంగా పిలుచుకునే వారు.



# రిజర్వేషన్ లక్ష్యంగా చేపట్టిన దీక్ష విరమణ

(మొదటి పేజీ తరువాయి)

తెలుసని హెచ్చరించారు. హైదరాబాద్ ధర్నా చౌక్‌లో సోమవారం ఉదయం కవిత తన అనుచరులతో కలిసి దీక్ష చేపట్టారు. అయితే దీక్షకు హైకోర్టు అనుమతి లేకపోవడంతో, ఈ దీక్షను తక్షణమే విరమిస్తున్నట్టు ప్రకటించారు. తనకు కోర్టులపై గౌరవం ఉందని మరోసారి స్పష్టం చేశారు.

ధర్నాలతో ప్రయోజనం ఉండదని పేర్కొన్న కవిత, “మీరు నిజంగా బీసీల కోసం పనిచేయాలనుకుంటే రాష్ట్రపతి దగ్గరకు వెళ్లండి. గవర్నర్‌పై సుప్రీంకోర్టులో కేసు వేయండి” అని కాంగ్రెస్ నేతలకు హితవు పలికారు. ఢిల్లీలో టైమ్‌పాస్ ధర్నాలు చేస్తే బీసీ బిడ్డలు ఊరుకోరని తీవ్రంగా హెచ్చరించారు. తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును అసెంబ్లీలో ఆమోదించి గవర్నర్‌కు పంపింది. అనంతరం కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు బిల్లు పంపారు. బిల్లును ఆమోదించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నేడు (ఆగస్టు 5) న్యూఢిల్లీలో ధర్నాకు సిద్ధమవుతోంది.

# పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- **బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు**
- **అసెంబ్లీలో నిరసన, గాంధీ విగ్రహానికి వినతి**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. వారిపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించినా స్పీకర్ ఎందుకు జాప్యం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసేందుకు సమయం ఇవ్వాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరారు. ఈ మేరకు సోమవారం అసెంబ్లీలో స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లారు. కానీ, స్పీకర్ అక్కడకు రాలేదు. కార్యాలయం తలుపులు కూడా తీయలేదు. దీన్ని నిరసిస్తూ వారు అసెంబ్లీ ఆవరణలోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. “పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దు చేయాలి...వీ వాంట్ జస్టిస్..” అంటూ నినాదాలు చేశారు. గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ...పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరేందుకు అసెంబ్లీకి వెళ్తే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అందుబాటులో లేరని తెలిపారు. ఇంటి వద్దా, మంత్రుల నివాస సముదాయంలోనూ ఆయన లేరని తెలిసిందని చెప్పారు. సమాచారం ఇచ్చినా ఎందుకు అందుబాటులో లేరని ప్రశ్నించారు. స్పీకర్ జాప్యం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని కాలరాయడం సరిగాదనీ అన్నారు.

# అసెంబ్లీలో కాళేశ్వరం నివేదికపై చర్చ

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టు కూలిపోయిందని జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికలో స్పష్టంగా పొందుపరిచారు. కమిషన్ విషయంలో ఎలాంటి రాజకీయ జోక్యం లేదు. పూర్తిగా స్వతంత్ర న్యాయ కమిషన్ ఇచ్చిన నివేదిక. రాజకీయ కక్షలకు తావు లేదు..” అని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు చెప్పారు.

మీడియా సమావేశంలో ముఖ్యమంత్రితో, ఉప ముఖ్యమంత్రి , నీటి పారుదల శాఖ మంత్రి (పవర్ పాయింట్ ప్రజెంటేషన్) వివరించిన కొన్ని అంశాలు:

‘ఈ మూడు బ్యారేజీల నిర్మాణం ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ గారి ఏకైక నిర్ణయం.

తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని చెప్పడం నిజం కాదు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణమే అవసరం లేదని అప్పట్లోనే నిపుణుల కమిటీ నివేదించగా, ఉద్దేశపూర్వకంగా ఆ నివేదికను తొక్కిపెట్టారు.

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రణాళిక, లోపభూయిష్టమైన డిజైన్లు, లోపభూయిష్టమైన నిర్మాణం, ఆపరేషన్ – నిర్వహణ లోపం.

మాన్యువల్స్ లేవు. ఒప్పందాలు లేవు. పూర్తయినట్టు చట్ట విరుద్ధమైన సర్టిఫికేట్ల జారీ. బ్యాంకు గ్యారెంటీల విడుదల

సరైన ప్రణాళికలు లేకపోవడం, తప్పుడు అంచనాలు, చట్ట విరుద్ధమైన ఆమోదాల వంటి ప్రతి దశలోనూ అవకతవకలు.

బ్యారేజీల నిర్మాణంపై నోట్ ఫైల్ తప్ప మంత్రిమండలి ఆమోదం లేదు.

చట్ట విరుద్ధమైన కాంట్రాక్టులు, సవరించిన అంచనాలు.

సాంకేతిక పర్యవేక్షణ, ఆర్థిక క్రమశిక్షణ వైఫల్యం కారణంగా భారీగా ప్రజాధనం వృధా.

ప్రాజెక్టులో జరిగిన తప్పిదాలకు ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు గారు ప్రత్యక్షంగా, పరోక్షంగా బాధ్యులు.

కేసీఆర్‌తో పాటు ఆనాటి నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు కూడా బాధ్యులే.

ప్రాజెక్టు నిర్మాణంలో విచ్చలవిడి అవినీతి, ఆర్థిక పరమైన అవకతవకలు చోటుచేసుకున్నాయి.

అదనపు పనులన్నీ నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టారు. భారీగా నిధుల దుర్వినియోగం జరిగింది.

కొందరు అధికారులూ ఇందుకు బాధ్యులే. తప్పుడు సాక్ష్యాలు సమర్పించారు. బాధ్యులైన వారందరిపై తగిన చర్యలు తీసుకోవాలి.’

# మునిగిన నగరం

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పడింది. ఎల్లారెడ్డిగూడలో భారీగా వరద నీరు చేరింది. పలు ఇండ్లలోకి వర్షపు నీరు ప్రవహించటంతో పలు ఇండ్లలోని నిత్యావసర వస్తువులు తడిచిపోయాయి. అమీర్‌పేటలోని ఇమేజ్ ఆస్పత్రి ప్రాంతం కూడా ముంపునకు గురైంది. భారీ వర్షం కారణంగా సైఫాబాద్‌లోని ఓ హోటల్‌కు లంచ్‌కు వచ్చిన వినియోగదారులు ఇబ్బందుల పాలయ్యారు. రాజ్ భవన్ రోడ్డులో భారీగా వరద నీరు నిలిచింది. ఫలితంగా ఖైరతాబాద్ నుంచి అమీర్‌పేట, పంజాగుట్ట, బేగంపేట వరకు, ఖైరతాబాద్ నుంచి ట్యాంక్ బండ్, నాంపల్లి, బషీర్ బాగ్, కోఠి వైపు వెళ్లే రహదారుల్లో గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. వర్షం ఆగిన తర్వాత ఒక్కసారిగా వాహనాలు రోడ్లపైకి రావటంతో గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, పంజాగుట్టతో పాటు బేగంపేట, ఖైరతాబాద్, తెలుగుతల్లి ఫ్లై ఓవర్లపై వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. మరో రెండు రోజుల పాటు నగరంలో భారీ ఒక్క మోస్తారు నుంచి భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో నగరవాసులంతా అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ, హైడ్రా ప్రజలను విజ్ఞప్తి చేసింది.

# నిజమైన భారతీయులు

## అలా మాట్లాడరు

(మొదటి పేజీ తరువాయి)

“ఒక ప్రతిపక్ష నేతగా దేశంలో జరుగుతున్న అంశాలపై ప్రశ్నించకపోతే ఆయన తన పాత్రను ఎలా పోషించగలరు?” అని వాదించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం సభ్యులు జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మానిహ్‌లు, “అవసరమైన విషయాలను పార్లమెంట్‌లో లేవనెత్తాలి కానీ సోషల్ మీడియా వేదికగా కాదు” అని స్పష్టం చేశారు.

2020 గల్వాన్ ఘర్షణను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ, “దాదాపు 2 వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని చైనా స్వాధీనం చేసుకుంది. ఇది ఢిల్లీ కంటే ఎక్కువ వైశాల్యం. కేంద్రం మాత్రం దీనిపై స్పందించడం లేదు. ప్రధాని మోదీ ఆక్రమణే జరగలేదని అబద్ధాలు చెబుతున్నారు” అంటూ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు సైన్యాన్ని అవమానించేవిగా ఉన్నాయంటూ ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ అనే వ్యక్తి, రాహుల్‌పై న్యాయస్థానంలో 2022లోనే ఫిర్యాదు దాఖలు చేశారు. ఇప్పుడు ఈ కేసులో సుప్రీంకోర్టు స్పందిస్తూ, రాష్ట్ర భద్రత, సైనిక గౌరవానికి భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేయకూడదని సూచించింది.

## కాళేశ్వరం కన్నెపల్లి పంపుహౌస్ మోటర్లను వెంటనే ఆన్ చేయాలి

**బలగం టీవీ, జయశంకర్ భూపాలపల్లి:**

కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోయకుండా తెలంగాణను ఎడారిగా మార్చేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ కుట్రలను తిప్పి కొట్టడానికి సోమవారం కరీంనగర్ ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ బృందం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆధ్వర్యంలో కన్నెపల్లి పంప్ హౌస్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా మీడియాతో వారు మాట్లాడుతూ.. వెంటనే కాళేశ్వరం పంపు హౌస్ లను ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని, ఇప్పటికే కొన్నిచోట్ల బోర్లు ఎండిపోతున్నాయని, నార్లు ముదురుతున్నాయన్నారు, అలాగే ఎస్సారెస్పీ కాలువలు ఎండగట్టుకపోయాయని వెంటనే నీటిని విడుదల చేసి రైతన్నకు మేలు చేయాలన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ కుట్రలు కుతంత్రాలు మానుకొని రైతన్నకు సాగునీరు అందించాలని పంప్ హౌస్ వద్ద బిఆర్ఎస్ శ్రేణులు కాసేపు ధర్నాకు దిగారు. వారిని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం కూడా చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్, వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, మాజీ ఎమ్మెల్యే లు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ జడ్పీ చైర్ పర్సన్లు, జడ్పిటిసిలు పాల్గొన్నారు.

# భారత్ థ్రిల్లింగ్ విక్టరీ

- ఓవల్ టెస్టులో 6 పరుగుల స్వల్ప తేడాతోఇంగ్లండ్‌పై భారత్ గెలుపు
- ఐదు వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించిన సిరాజ్
- 2-2తో సమంగా ముగిసిన ఆండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ




**బలగం టీవీ, ఓవల్**

ఇంగ్లండ్ పర్యటనను భారత జట్టు చిరస్మరణీయ విజయంతో ముగించింది. ఉత్కంఠ భరితంగా సాగిన ఐదవ టెస్టులో భారత్ 6 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను 2-2తో సమం చేసింది. 339/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లండ్.. 85.1 ఓవర్లలో 367 పరుగులకు ఆలౌటైంది. ఈ విజయానికి ప్రధాన శిల్పి మహమ్మద్ సిరాజ్ (5/104) అయ్యాడు.

ఆఖరి రోజు ఇన్నింగ్స్‌ను జెమీ ఓవర్టన్ బౌండరీలతో ప్రారంభించినప్పటికీ, సిరాజ్ రెండు కీలక వికెట్లు తీసి మ్యాచ్‌ను భారత్ పక్షాన తిప్పాడు. జెమీ స్మిత్ (2), ఓవర్టన్ (9)లను త్వరగా పెవిలియన్ పంపిన సిరాజ్.. అట్కిన్సన్ (తీవ్రంగా పోరాడినా) చివరికి క్లీన్‌బౌల్డ్ చేసి భారత విజయానికి ముద్ర వేశాడు.జోష్ టంగ్(0) ను ప్రసిద్ కృష్ణ స్టన్నింగ్ యార్కర్‌తో బౌల్డ్ చేయడం ద్వారా భారత్ విజయం వైపు మళ్లింది. చివర్లో క్రిస్ వోక్స్ గాయం అనంతరం ఒంటి చేత్తో బ్యాటింగ్ చేయడం, అట్కిన్సన్ ధైర్యంగా బరిలో ఉండడం ఉత్కంఠను పెంచినా చివరికి టీమిండియానే గెలిచింది.

అంతకుముందు, భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 224, రెండో ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ (118) సెంచరీతో 396 పరుగులు చేసింది. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 247, రెండో ఇన్నింగ్స్‌లో 367 పరుగులకు ఆలౌట్ అయింది.

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్లు లేకపోయినా యువ జట్టు సాధించిన ఈ విజయం సిరీస్‌కే హైలైట్‌గా నిలిచింది.

ఈ ఐదు టెస్టుల సిరీస్ 2-2తో ముగియగా, దీనిని ఇతిహాసంలో గొప్ప టెస్టు సిరీస్‌లలో ఒకటిగా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. జో రూట్, హ్యారీ బ్రూక్‌ల సెంచరీల వృద్ధి వృథా అయ్యింది.

భారత్ 1వ ఇన్నింగ్స్: 224
ఇంగ్లండ్ 1వ ఇన్నింగ్స్: 247
భారత్ 2వ ఇన్నింగ్స్: 396
ఇంగ్లండ్ : 367

# హీరో మహమ్మద్ సిరాజ్

- 9 వికెట్లతో విజయంలో కీలక పాత్ర
- ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకున్న సిరాజ్

**బలగం టీవీ, ఓవల్**




ఇంగ్లండ్‌తో జరిగిన ఉత్కంఠభరిత ఓవల్ టెస్టులో టీమిండియాను విజయ తీరాలకు చేర్చిన వేగబౌలర్ మహమ్మద్ సిరాజ్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును గెలుచుకున్నాడు. మొత్తం రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 9 వికెట్లు పడగొట్టిన సిరాజ్ భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు.

తొలి ఇన్నింగ్స్‌లో సిరాజ్ 86 పరుగులు ఇచ్చి 4 వికెట్లు,, రెండో ఇన్నింగ్స్‌లో 104 పరుగులకు 5 వికెట్లు తీసి ఇంగ్లండ్ టెయిలెండర్లను తడబడేలా చేశాడు. ముఖ్యంగా జేమీ స్మిత్, ఓవర్టన్, అట్కిన్సన్‌ల వికెట్లు తీసి టీమిండియాకు అద్భుత గెలుపును అందించాడు.

**నమ్మకం... గెలుపు తీసుకొచ్చింది : సిరాజ్**

మ్యాచ్ అనంతరం స్పందించిన సిరాజ్ మాట్లాడుతూ "మ్యాచ్ గెలవడం చాలా సంతోషంగా ఉంది. మొదటి రోజు నుంచీ చివరి రోజు వరకూ కష్టపడి పోరాడాం. లైన్‌లో బౌలింగ్ చేసి వత్తిడి పెంచాలన్న ఆలోచనతో మైదానంలోకి దిగాను. నిద్రలేచినప్పుడే ఈ రోజు గొప్పగా సాగుతుందన్న నమ్మకం వచ్చింది" అని చెప్పాడు. "గూగుల్‌లో ఒక 'బిలీవ్' పిక్ డౌన్లోడ్ చేసి ఉదయమే చూసాను... అదే ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది", అని సిరాజ్ ఆసక్తికరంగా వెల్లడించాడు.

సిరాజ్ మాట్లాడుతూ "బ్రూక్ క్యాచ్‌ను వదిలేసినప్పుడు మళ్లీ మైదానంలో అడుగుపెట్టకుండానే మ్యాచ్ ముగిస్తామని అనుకున్నాం. అయితే బ్రూక్ అద్భుతంగా ఆడాడు. అతని బ్యాటింగ్‌కి హ్యాట్సాప్ చెబుతా" అని తెలిపారు. ఈ మ్యాచ్‌లో సిరాజ్ బంతిని పిచ్‌కు తగ్గట్లు స్వింగ్ చేస్తూ, ఇంగ్లండ్ బ్యాటర్లను టీజ్ చేశాడు. ఒక్కో బంతికి ఉత్కంఠ పెంచుతూ మ్యాచ్ మొత్తాన్ని తన గెంతులతో శాసించాడు.

## మహ్మద్ సిరాజ్‌పై తెలంగాణ పోలీస్ శాఖ ప్రశంసల వర్షం




ఇంగ్లండ్‌తో జరిగిన చివరి టెస్టులో అద్భుత ప్రదర్శనతో టీమిండియాను గెలిపించిన స్టార్ పేసర్, హైదరాబాద్ ముద్దుబిడ్డ మహ్మద్ సిరాజ్‌పై తెలంగాణ పోలీస్ శాఖ ప్రశంసల జల్లు కురిపించింది. టీమిండియా విజయానికి ప్రధాన కారకుడిగా నిలిచిన సిరాజ్‌ను, "తెలంగాణ గర్వకారణం" అంటూ అభినందించింది. సిరాజ్ కేవలం అంతర్జాతీయ క్రికెటర్‌గానే కాకుండా, తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) హోదాలో పనిచేస్తుండటం విశేషం. క్రీడలతో పాటు సేవాభావంలోనూ సిరాజ్ ముందంజలో ఉన్నాడని అధికారులు గుర్తుచేశారు.

ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌ను 2-2తో సమం చేసిన చివరి టెస్టులో సిరాజ్ 9 వికెట్లతో విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ విజయం అనంతరం హైదరాబాద్ పోలీస్ శాఖ తమ అధికారిక సోషల్ మీడియా ఖాతా ద్వారా స్పందిస్తూ, "డీఎస్పీ మహ్మద్ సిరాజ్‌కు అభినందనలు. ఇంగ్లండ్‌పై చారిత్రక విజయంలో మీ ప్రదర్శన అద్భుతం." అని పేర్కొంది. అలాగే, "క్రీడల్లోనే కాదు, యూనిఫాంలోనూ హీరో!" అంటూ ప్రత్యేక హ్యాష్‌ట్యాగ్‌తో అభినందనలు తెలిపింది. సామాన్య కుటుంబ నేపథ్యం నుండి వచ్చిన సిరాజ్ తన ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో జెండా ఎగురవేస్తూ, రాష్ట్రానికి, పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచాడు. దేశ సేవలో ఉన్న ఒక అధికారిగా ప్రపంచ క్రీడా వేదికపై సత్తా చాటిన సిరాజ్‌ను, రాష్ట్రవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# ఫిల్మ్ ఫెడరేషన్ కార్మికుల ఆందోళన

**వేతనాలు పెంచాలని డిమాండ్**

**అన్నపూర్ణ స్టూడియో వద్ద తీవ్ర ఉద్రిక్తత**

**బలగం టీవీ, హైదరాబాద్**

వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ తెలుగు ఫిలిం ఫెడరేషన్‌కు చెందిన 24 క్రాఫ్ట్ కార్మికులు సోమవారం అన్నపూర్ణ స్టూడియో వద్ద తీవ్ర ఆందోళన చేపట్టారు. పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాకు మైత్రీ మూవీస్ నిర్మాణంలో బొంబాయి, చెన్నై ప్రాంతాల కార్మికులతో షూటింగ్ జరుపుతున్నారంటూ ఆగ్రహించిన కార్మికులు స్టూడియోలోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించగా, పోలీసులు మోహరించి వారిని అడ్డుకున్నారు.

వేతనాలను 30 శాతం పెంచాలన్న డిమాండ్‌పై గత నాలుగు నెలలుగా చర్చలు కొనసాగుతున్నప్పటికీ మైత్రీ మూవీస్ స్పందించలేదని కార్మికులు ఆరోపించారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న 12 చిత్రాలకు చెందిన నిర్మాతలు వేతన పెంపునకు అంగీకరించగా, మైత్రీ మూవీస్ మాత్రం తిరస్కరించడమే కాకుండా, ఫెడరేషన్ కార్మికులను పక్కనబెట్టి బయటి కార్మికులతో పని చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. "మేము మైత్రీ మూవీస్ 6 సినిమాల కోసం పనిచేశాం. కానీ ఇప్పటివరకు మా బకాయిలను చెల్లించలేదు. వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం." అంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 2గంటలపాటు ఆందోళన అనంతరం ఫెడరేషన్ ప్రతినిధులతో చర్చలకు పిలవడంతో ఆందోళనను తాత్కాలికంగా విరమించారు.

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ కార్మికుల వేతనాల పెంపును ఖండించింది.

సినిమాల నిర్మాణ వ్యయం పెరిగిందనీ, హిట్లు రావటం లేదనీ, ఇలాంటి పరిస్థితుల్లో వేతనాల పెంపు సాధ్యంకాదన్నట్లుగా కొందరు నిర్మాతల వాదన. హైదరాబాద్‌లోని ఫిల్మ్ చాంబర్ కార్యాలయంలో సోమవారంనాడు నిర్మాతల మండలి అత్యవసర సమావేశం జరిగింది. అల్లు అరవింద్, దిల్‌రాజ్, సురేష్‌బాబు, మైత్రీ రవి, సి.కళ్యాణ్, చెరుకూరి సుధాకర్, సుప్రియ వంటి ప్రముఖ నిర్మాతలు ఈ సమావేశంలో పాల్గొని కార్మికుల డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఆదివారం ఫెడరేషన్, నిర్మాతల మండలి సమావేశం జరిగినా ఏకాభిప్రాయం కుదరలేదు. సోమవారం జరిగిన సమావేశంలో నిర్మాతల మండలి ప్రతినిధులు మాత్రం 30 శాతం వేతనాల పెంపు అందరికీ సాధ్యం కాదనీ, ఇది చిన్నా, పెద్ద సినిమాలపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. కొందరు తమ అవసరాలకు అనుగుణంగా పెంచుకుని ముందుకెళ్తే తమకేమీ అభ్యంతరం లేదంటూ కూడా ప్రకటించారు. దీంతో కొందరు నిర్మాతలు ఫెడరేషన్ ప్రతినిధులతో మాట్లాడి కొన్ని సినిమాల షఉటింగ్‌లు కొనసాగించారు. నిర్మాత సి.కళ్యాణ్, ఫెడరేషన్ మాజీ కార్యదర్శి జగదీష్‌రెడ్డి, తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ కార్యదర్శి కె.ఎల్.రామోదర్‌ప్రసాద్ షఉటింగ్‌లు ఆగిపోతే నిర్మాణంలో ఉన్న చిత్రాలకు భారీ నష్టం వచ్చే ప్రమాద ముందని పేర్కొన్నారు. అన్నపూర్ణ స్టూడియోస్‌లో షూటింగ్‌లో పాల్గొంటున్న పవన్ కల్యాణ్‌తో మాట్లాడేందుకు ఇరు సంఘాల నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

# వైవిధ్యభరితమైన పాత్రలే నాకు ఇష్టం : నాగ్

**బలగం టీవీ, హైదరాబాద్**

"నిన్నే పెళ్లాడతా'లాంటి ప్రేమ కథ తర్వాత 'అన్నమయ్య' వంటి భక్తిరస చిత్రం చేసిన నా కెరీర్‌లో వైవిధ్యం ఎప్పుడూ ఉంటూనే ఉంది. ఇప్పుడు 'కూలీ'లో అంతే కొత్తగా 'సైమన్' అనే ప్రతినాయక పాత్రలో కనిపించబోతున్నాను," అని అగ్ర నటుడు నాగార్జున తెలిపారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా, లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో రూపొందిన ఈ భారీ చిత్రం 'కూలీ' ఈ నెల 14న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రాన్ని ఏషియన్ మల్టీప్లెక్స్ సంస్థ తెలుగులో విడుదల చేయబోతోంది. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్లో నాగార్జునతో పాటు దర్శకుడు లోకేష్ కనకరాజ్, శృతిహాసన్, సత్యరాజ్, సునీల్ నారంగ్, సురేష్ బాబు, దిల్ రాజు తదితరులు పాల్గొన్నారు.



నాగ్ మాట్లాడుతూ.. "ఈ సినిమాలో నేను పోషించిన 'సైమన్' పాత్ర, ప్రతినాయకుడైనా కూడా కథలో చాలా బలంగా ఉంటుంది. కథ వినగానే నచ్చిపోయింది. కొన్ని సూచనలు చేయగా దర్శకుడు వాటిని స్వీకరించి పాత్రను మరింత గట్టి చేశారు," అని చెప్పారు."ఒక సన్నివేశం సమయంలో రజనీ సర్ నన్ను చూసి 'మీరు ఇంత ఫిట్‌గా ఉన్నారని తెలిస్తే సినిమాలో చేయవద్దని లోకేష్‌కు చెప్పేవాడిని' అని సరదాగా అన్నారు," అని నాగార్జున పేర్కొన్నారు. "ఆయన కమిట్‌మెంట్ అద్భుతం. ఇన్ని సినిమాలు చేసినా, ఇప్పటికీ ప్రతి డైలాగ్‌ను ప్రాక్టీస్ చేస్తుంటారు. ఆయనతో కలిసి పనిచేయడం నాకు ఎంతో కొంత యాక్టింగ్‌లో పెరుగుదలగా అనిపించింది," అన్నారు నాగ్.

## బాక్సాఫీస్‌ను షేక్ చేసిన 'మహావతార్ నరసింహ'

**బలగం టీవీ, హైదరాబాద్**




కేజీఎఫ్, కాంతార వంటి విజయవంతమైన చిత్రాలు అందించిన హెూంబలే ఫిల్మ్స్ మరియు క్లీమ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా రూపొందించిన చిత్రం 'మహావతార్ నరసింహ' . జూలై 25న పరిమిత థియేటర్లలో విడుదలైంది. విడుదలైన రోజు రూ.1.75 కోట్లు మాత్రమే వసూలు చేసినా, ప్రేక్షకుల మౌత్ టాక్ బలంతో 10 రోజుల్లో రూ.105 కోట్ల వసూళ్లు సాధించి భారత చరిత్రలో అత్యధికంగా వసూలు చేసిన యానిమేటెడ్ చిత్రంగా నిలిచింది.

దర్శకుడు అశ్విన్ కుమార్ పౌరాణిక అంశాలను ఆధారంగా తీసుకొని ప్రహ్లాదుని చరిత్ర, హిరణ్యకశిపునిపై నరసింహుడి విజయం వంటి ఘటనలను అత్యాధునిక యానిమేషన్‌తో ఆవిష్కరించారు. రూ.15 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రానికి కథన బలం దానికి విజయాన్ని అందించింది. ఈ చిత్రాన్ని హిందూ సంస్థలు, స్వామీజీలు స్వయంగా ప్రోత్సహించడమే కాక, ప్రత్యేక ప్రదర్శనలకూ హాజరై మద్దతు తెలిపారు. హైదరాబాద్‌లో 200 మంది స్వామీజీలు ఒకే థియేటర్‌లో ఈ సినిమాను వీక్షించడం ప్రాచుర్యంలో ఉన్న స్థాయిని చూపిస్తోంది. ఈ చిత్రం స్ఫూర్తిగా, రాబోయే రోజుల్లో మరిన్ని పౌరాణిక యానిమేషన్ చిత్రాలు రూపొందే అవకాశం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. భారతీయ యానిమేషన్ పరిశ్రమకు మార్గదర్శకంగా ఈ చిత్రం నిలవనుందని విశ్లేషణలు సూచిస్తున్నాయి.